**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 116 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 18 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# ఈ విషయంలో మాతో ఎవరూ పోటీ పడలేరు

- వచ్చే నెలలోనే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు
- 2026 ఆగస్టు నాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధం
- పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్న సీఎం
- ఏపీలో బాధ్యతాయుతమైన ప్రభుత్వం అధికారంలో ఉందని స్పష్టం చేసిన చంద్రబాబు
- ప్రధాని మోదీ దేశానికి పెద్ద ఆస్తి అని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో రెండంకెల వృద్ధి సాధిస్తామని ధీమా





ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, రాష్ట్రంలో బాధ్యతాయుతమైన ప్రభుత్వం అధికారంలో ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కేవలం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మాత్రమే కాదని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో తమతో ఎవరూ పోటీ పడలేరని ఆయన పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. విశాఖపట్నంలో బుధవారం జరిగిన సీఐఐ-గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ నివేదికను ఆవిష్కరించిన అనంతరం సీఎం కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేలా, విశాఖ కేంద్రంగా కీలక పరిణామాలు జరగనున్నాయని చంద్రబాబు వెల్లడించారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థ గూగుల్‌కు చెందిన డేటా సెంటర్‌ను వచ్చే నెలలోనే విశాఖలో ఏర్పాటు

వివరాలు 2లో..



## ప్రతిపక్షం గురించి మాట్లాడాలంటే బూతులొస్తున్నాయ్

### నిర్మల ఘాటు వ్యాఖ్యలు

- పేదలు, మధ్యతరగతి మేలు కోసం జీఎస్టీ 2.0
- ఆత్మనిర్భర్ భారత్‌కు ఇదో పెద్ద ఊతం
- నవరాత్రుల నుంచి ప్రజలకు పన్నుల ఉపశమనం
- విశాఖలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

విశాఖపట్నం, సెప్టెంబర్ 17: విశాఖ వి.కన్వెన్షన్‌లో నిర్వహించిన నెక్స్ట్ జెన్ జీఎస్టీ 2.0 అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వం హయాంలో భిన్నమైన

వివరాలు 2లో..

## అమరావతి అసైన్డ్ రైతులకు బిగ్ రిలీఫ్..!

### రిటర్నబుల్ ప్లాట్ పత్రాల్లో మార్పు..!



అమరావతి, సెప్టెంబర్ 17: ఏపీ రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతులకు బుధవారం ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులు గతంలో రాజధాని కోసం తమ భూములిచ్చిన క్రమంలో వారికి ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇచ్చేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం వారికి రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నారు. అయితే ఇందులో పెట్టిన ఓ క్లాజ్ కారణంగా వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో

వివరాలు 2లో..

## లీకేజ్ లతో మద్యం ఆదాయానికి గండి ?

### వైసీపీ ఆరోపణలు..!



తాడేపల్లి, సెప్టెంబర్ 17: రాష్టం లో కూటమి సర్కార్ గతేడాది కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం తమ చేతుల్లోకి తీసుకున్న మద్యం వ్యాపారాన్ని తిరిగి ప్రైవేటు వారికి అప్పగించింది. మద్యం వ్యాపారంలో అవినీతిని అడ్డుకునేందుకు పూర్తి పారదర్శక విధానం అమలు చేస్తున్నట్లు చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో పెరగాల్సిన మద్యం ఆదాయాలు ఆశించిన మేర లేకపోవడం పై

వివరాలు 2లో..

## ఇది ఆరంభం మాత్రమే..

### ఇంకా ఎన్నో సంస్థలతో చర్చలు జరుగుతున్నాయి


### ఏపీ అభివృద్ధి పై లండన్ లో నారా లోకేష్

- గడిచిన 15 నెలల్లోనే ఏపీకి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు
- చంద్రబాబు వల్లే ఇది సాధ్యమైందని వెల్లడి
- క్వాంటమ్ వ్యాలీ, డేటా సిటీలతో రాష్ట్ర రూపురేఖల మార్పు ఖాయం
- ఏఐ అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులకు ప్రత్యేక పాఠ్యాంశాలు
- పరిశ్రమల ఏర్పాటుకు అవరోధంగా ఉన్న నిబంధనల సరళీకరణ
- విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు-2025

వివరాలు 2లో..




## ఇంటికీ ఆర్థిక మంత్రులు మహిళలే



విశాఖపట్నం, సెప్టెంబర్ 17: 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడానికి, పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కంకణం కట్టుకుని పనిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం విశాఖపట్నం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆడ బిడ్డల ఆరోగ్యం ఏ విధంగా కాపాడాలి అనే ఉద్దేశం తోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు

వివరాలు 2లో..

## ప్రధాని మోదీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్

- ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు
- ప్రధాని మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు
- మోదీ నాయకత్వాన్ని కొనియాడుతూ డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేక పోస్ట్
- సరైన సమయంలో దేశానికి సరైన నాయకుడు దొరికారని చంద్రబాబు ప్రశంస
- సామాన్యుడిగా ఎదిగి దేశానికి మార్గనిర్దేశం చేస్తున్నారని పవన్ కితాబు

వివరాలు 2లో..



ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు



## అందరికీ కృతజ్ఞతలు

- దేశ విదేశాల నుంచి ప్రధాని మోదీకి వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు
- మోదీ జన్మదినోత్సవాన్నిపురస్కరించుకుని దేశ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ
- జనశక్తికి కృతజ్ఞతలు అంటూ ప్రధాని మోదీ ట్వీట్

వివరాలు 2లో..

## ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించండి..

### పేదలు ఇబ్బంది పడుతుండ్రు

- మానవీయ కోణంలో ఆలోచన చేయాలె
- ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ రిక్వెస్ట్



ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరించాలని ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య శ్రీ నిలిపి వేయడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ ఉచిత పరిమితి రూ.5 లక్షల నుంచి

వివరాలు 2లో..

## ఈవీఎంలపై గుర్తులతో పాటు అభ్యర్థి కలర్ ఫోటో..

### ఈవీఎంల పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

- ఈవీఎం బ్యాలెట్ పేపర్ల డిజైన్‌లో ఎన్నికల సంఘం మార్పులు
- రంగుల్లో, పెద్ద సైజులో అభ్యర్థుల ఫోటోలు
- బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి కొత్త విధానం అమలు
- ఓటర్ల సౌకర్యార్థం, గందరగోళాన్ని నివారించేందుకు ఈసీ నిర్ణయం
- అసెంబ్లీ ఎన్నికలకు పింక్ రంగు పేపర్ వాడకం
- గత 6 నెలల్లో ఈసీ తెచ్చిన 28 సంస్కరణల్లో ఇదొకటి




వివరాలు 2లో..

## కారును ఢీ కొట్టిన టిప్పర్..

### నెల్లూరు జిల్లాలో ఏడుగురు దుర్మరణం

- నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- టిప్పర్, కారు ఢీకొని ఏడుగురు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో ఓ చిన్నారి కూడా.. పెరమనలో విషాదఛాయలు
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులకు ఆదేశం

రాంగ్ రూట్ లో దూసుకు వచ్చిన ఓ టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. దీంతో కారులోని ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే చనిపోయారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈ రోజు ఉదయం చోటుచేసుకుందీ ఘోర ప్రమాదం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగం మండలం పెరమన వద్ద జాతీయ రహదారిపై ఈ ఘోర ప్రమాదం జరిగింది.



వివరాలు 2లో..

## నిరుద్యోగులకు అండగా ఉంటా



- ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగ యువత డిమాండ్లు
- నిరుద్యోగులకు అండగా ఉంటానన్న రాజగోపాల్ రెడ్డి
- నిరుద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ

వివరాలు 2లో..

# నిరుద్యోగులకు అండగా ఉంటా

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగ యువత చేస్తున్న డిమాండ్లకు మద్దతు పలుకుతున్నానని అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.నిరుద్యోగుల ఆందోళన సరైనదేనని పేర్కొన్న రాజగోపాల్ రెడ్డి, వారికి దారి చూపి, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. అమరవీరుల సాక్షిగా తాను యువతకు అండగా నిలుస్తానని, వారి సమస్యలు వినడానికి తానే స్వయంగా వస్తానని భరోసా ఇచ్చారు. నిరుద్యోగుల నిరసనలకు తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో యువత పోషించిన పాత్రను ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలతో పాటు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఏ సమస్యనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతోనే సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని, ఆ స్ఫూర్తితోనే యువతకు న్యాయం జరగాలని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించండి.. పేదలు ఇబ్బంది పడుతుండ్రు

-మొదటిపేజీ తరువాయి

రూ. 10 లక్షలకు పెంచడంతో పాటు ప్రైవేటు ఆసుపత్రులకు రూ.1,779 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. 2014-23 నవంబర్ వరకు సగటున నెలకు రూ.57 కోట్ల చెల్లించగా 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు సగటున రూ.75 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపు లు జరుపుతున్నారని, ఇప్పటికే రూ.100 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. పెండింగ్ డబ్బులు విడతల వారిగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినందున.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యా లను కోరారు.

## ఈవీఎంలపై గుర్తులతో పాటు అభ్యర్థి కలర్ ఫోటో..

న్యూ దిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈవీఎం బ్యాలెట్ పేపర్లు చదివేందుకు మరింత సులువుగా ఉండేలా నిబంధనలను ఈసీఐ సవరించింది. తొలిసారి ఈవీఎం లపై గుర్తులతో పాటు అభ్యర్థుల కలర్ ఫోటోలు కూడా ఉండబోతున్నాయి. సీరియల్ నెంబర్లను కూడా ప్రముఖంగా డిస్‌ప్లే చేయనున్నారు. తొలిసారిగా బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి ఈ కొత్త నిబంధనలు అమలు లోకి రానున్నాయి. కాండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ 1961 లోని 49 బి నిబంధన ప్రకారం ఎన్నికల కమిషన్ ప్రస్తుత నిబంధనలను సవరించింది. డిజైన్, ఈవీఎం బ్యాలెట్ పేపర్ల ప్రిటింగ్ మరింత స్పష్టతగా, రీడబిలిటీ ఉండేలా నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియను మెరుగపరచడం, ఓటర్లకు మరింత సౌలభ్యం పెరిగేందుకు ఈసీ ఐ గత ఆరు నెలలుగా కసరత్తు చేస్తోంది. ఈసీ ఐ కొత్త నిబంధనల ప్రకారం ఈవీఎం బ్యాలెట్ పేపర్ల పై అభ్యర్థుల ఫోటోలు కలర్‌లో ముద్రిస్తారు. ఫోటో స్పేస్‌లో నాలుగింట మూడు వంతులు అభ్యర్థి ఫోటో ఉంటుంది. అభ్యర్థులు, నోటా సీరియల్ నెంబర్లు ఇంటర్నేషనల్ ఫారమ్ ఆఫ్ ఇండియన్ న్యూమరల్స్ పద్ధతిలో ప్రింట్ చేస్తారు. స్పష్టత కోసం అక్షరాకృతి పరిమాణం 30 గా, బోల్డ్‌లో ఉంటుంది. ఈవీఎం బ్యాలెట్ పేపర్లు 70 జీఎస్ఎం పేపర్ పై ముద్రిస్తారు. అసెంబ్లీ ఎన్నికల కోసం నిర్దిష్ట ఆర్జీబీ విలువలున్న పింక్ కలర్ పేపర్‌ను ఉపయోగిస్తారు. ఈ అప్‌గ్రేడెట్ ఈవీఎం బ్యాలెట్ పేపర్లను బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే అమల్లోకి తీసుకువస్తారు.

# అందరికీ కృతజ్ఞతలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా దేశ విదేశాల నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా పలువురు ప్రపంచ నేతలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.దేశీయంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రులు, వ్యాపారవేత్తలు మోదీకి సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించారు. పలు రాష్ట్రాల్లో మోదీ జన్మదినం సందర్భంగా ప్రజాప్రయోజన కార్యక్రమాలు, పథకాల ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు.

## అమరావతి అసైన్డ్ రైతులకు బిగ్ రిలీఫ్..! రిటర్నబుల్ ఫ్లాట్ పత్రాల్లో మార్పు..!

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం రైతుల వినతి మేరకు ఇవాళ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి కోసం అసైన్డ్ భూములిచ్చిన రైతులకు ఊరట దక్కేలా ఇవాళ సీఆర్డీయే కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో అసైన్డ్ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సీఆర్డీయేకు ఇచ్చిన వారికి రిటర్నబుల్ ప్లాట్ లలో అసైన్డ్ అని ప్రభుత్వం ప్రత్యేకంగా పేర్కొంది. ఇలా అసైన్డ్ అని ఉండటంతో తమ ప్లాట్ లు అమ్ముడు పోవడం లేదని ప్రభుత్వానికి రైతులు మొరపెట్టుకున్నారు. దీని పై ప్రభుత్వం అధికారుల అభిప్రాయం తీసుకుంది. చివరికి అమరావతి కోసం అసైన్డ్ రైతులు ఇచ్చిన భూములకు కూడా రిటర్నబుల్ ప్లాట్లలో అసైన్డ్ అనే పదం తీసివేసి పట్టా భూమి అని పేర్కొనాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ మేరకు ఇవాళ ల్యాండ్ పూలింగ్ చట్టంలో 9.24 లోని కాలం నంబర్ 7, రూల్ నంబర్ 11 (4) క్లాజ్ ను మారుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ జీవో నంబర్ 187 ను విడుదల చేశారు. దీంతో అసైన్డ్ భూముల రైతులు కూడా తమ ఫ్లాట్లను ఇతరులకు అమ్ముకునేందుకు వీలు కలిగింది. ఇప్పటికే అమరావతి రాజధాని ప్రాంతంలో గతంలో తమకు కేటాయించిన ఫ్లాట్లను చూపించడం లేదని కొందరు, రిజిస్ట్రేషన్లు చేయించడం లేదని మరికొందరు, అన్నీ ఉన్నా చిన్న చిన్న సమస్యలతో ఫ్లాట్లు అమ్ముకోలేకపోతున్నామని, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక్కో సమస్యనూ క్లియర్ చేస్తూ వస్తోంది.

## ప్రధాని మోదీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్

అమరావతి, సెప్టెంబర్ 17: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రముఖుల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు ప్రధాని మోదీ కి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా చంద్రబాబు మోదీ కి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు లభించడం గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. మోదీ ప్రవేశపెట్టిన 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' నినాదం దేశంలోని అనేక కుటుంబాల్లో సానుకూల మార్పులను తీసుకొచ్చిందని కొనియాడారు. చంద్రబాబు మాట్లాడుతూ, వికసిత భారత్ 2047 లక్ష్యంతో మోదీ తీసుకుంటున్న చర్యలు భారతదేశాన్ని గ్లోబల్ లీడర్గా నిలబెట్టేందుకు ఎంతగానో దోహద పడుతున్నాయని ప్రశంసించారు. ప్రధానికి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు %-% మోదీది ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని నూరే నాయకత్వం: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మోదీకి ఒక వివరణాత్మక సందేశంతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ సామాన్య వర్గం నుంచి రాజకీయ శిఖరాగ్రానికి ఎదిగి, దేశానికి క్రమశిక్షణతో కూడిన నాయకత్వాన్ని అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మోదీ నాయకత్వం కేవలం పాలనకే పరిమితం కాకుండా, జాతీయ ఐక్యత, గౌరవం, ఆత్మవిశ్వాసం వంటి విలువలను ప్రజల్లో నాటిందని పవన్ అభిప్రాయపడ్డారు. మోదీ ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ భారత్, పేదల పట్ల చూపే సహానుభూతి, మరియు దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించడంలో చూపిన దృఢ సంకల్పం ఆయన నేతృత్వాన్ని అప్రతిమంగా నిలబెట్టాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ రంగంలో మోదీ దౌత్యం అభినందనీయం: పవన్ తన సందేశంలో మోదీ దౌత్యపరంగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలను ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికల పై భారత దేశ ప్రయోజనాలను కాపాడడం, గ్లోబల్ సౌత్ తరపున మాట చెప్పడం వంటి విషయాల్లో మోదీ చూపిన నైపుణ్యం భారత గౌరవాన్ని పెంచిందని అన్నారు. ఈ పుట్టినరోజు సందర్భంగా మోదీ కి ఆరోగ్యంగా, శక్తివంతంగా, దేశానికి మరింత కాలం సేవ చేసే శక్తి ప్రసాదించాలని పవన్ కల్యాణ్ ప్రార్థించారు. దేశాన్ని ఐక్యత, శ్రేయస్సు, అంతర్జాతీయ గౌరవం దిశగా నడిపించేందుకు మోదీకి అన్ని శక్తులు చేకూరాలని ఆకాంక్షించారు.

# ఇది ఆరంభం మాత్రమే..

లండన్ : ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార వాతావరణం కేవలం మాటల్లోనే కాకుండా, వాస్తవంలో కూడా వేగంగా మారుతోందని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గత పదిహేను నెలల్లో రాష్ట్రానికి సుమారు 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆహ్వానించగలగడం ఈ మార్పుకు నిదర్శనమని ఆయన అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న దూరదృష్టి, స్పష్టమైన ప్రణాళికలు కీలకపాత్ర పోషిస్తున్నాయని లోకేష్ వివరించారు. లండన్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్%-%యూకే బిజినెస్ ఫోరం రోడ్ షోలో పాల్గొన్న లోకేష్, నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగబోయే ప్రతిష్టాత్మక భాగస్వామ్య సదస్సు%-%2025 కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి కొత్త అవకాశాలు, తాజా టెక్నాలజీలు, విస్తృత పెట్టుబడులు లభిస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందడానికి మూడు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది, మాకు సుస్థిరమైన, నిరూపితమైన నాయకత్వం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఆయన అనుభవం ఇప్పుడు నవ్యాంధ్ర కు దిక్సూచిగా మారింది అని తెలిపారు. రెండో అంశం వ్యాపార నిర్వహణలో వేగానికి ప్రాధాన్యత ఇవ్వడమని, దీనికి ఉదాహరణగా ఆర్సెలర్ మిట్టల్ సంస్థ విషయాన్ని ప్రస్తావించారు. భారత్ లోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను ఏపీలో ఏర్పాటు చేస్తున్న ఆర్సెలర్ మిట్టల్ సంస్థ, తమకు ఎదురైన మూడు సమస్యలను మా దృష్టికి తీసుకురాగా, కేవలం 12 గంటల్లోనే వాటిని పరిష్కరించాం. అందుకే వారు నవంబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించ బోతున్నారు అని వివరించారు. మూడో అంశం, తమ ప్రభుత్వంలో యువ నాయకత్వం ఎక్కువగా ఉండటమని, మంత్రుల్లో 17 మంది కొత్తవారేనని, స్టార్టప్ ఆలోచనా విధానంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, దేశంలో మరే రాష్ట్రం ఇంత సాహసోపేతమైన హామీ ఇవ్వలేదని లోకేశ్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చబోయే కీలక ప్రాజెక్టుల గురించి వివరిస్తూ, దక్షిణ ఆసియాలోనే తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రానుంది. ప్రధాని మోదీ క్వాంటమ్ మిషన్ ను ముందుండి నడిపించడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖలో డేటా సిటీ ఏర్పాటుతో రాష్ట్ర రూపురేఖలే మారిపోతాయి. ముంబై కంటే రెట్టింపు సామర్థ్యంతో 1.5 గిగావాట్ల డేటా సెంటర్లు విశాఖకు రానున్నాయి అని తెలిపారు. ఐటీ విప్లవాన్ని భారత్ అందిపుచ్చుకున్నట్టే, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దీనికోసం కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఏఐని ఒక పాఠ్యాంశంగా ప్రవేశపెడుతున్నామని అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలున్న యువతను తయారుచేయడానికి అక్టోబర్‌లో నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు అడ్డంకిగా ఉన్న నిబంధనలను సరళీకృతం చేస్తున్నామని, ఇందులో భాగంగా కార్మిక సంస్కరణలు, ల్యాండ్ కన్వర్షన్, నాలా ట్యాక్స్ వంటి అంశాల పై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చేసిన సూచనలను కేవలం 45 రోజుల్లోనే అమలు చేశామని లోకేష్ గుర్తుచేశారు. రాష్ట్రంలో 5,000 ఎకరాల్లో స్పేస్ సిటీ నిర్మించ బోతున్నామని, ఇందులో భాగంగా 'స్కైరూట్' సంస్థకు వారం రోజుల్లోనే 300 ఎకరాలు కేటాయించామని తెలిపారు. విజన్ %-% 2047 లక్ష్యాలను చేరుకోవడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టెక్ మహీంద్రా యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ సంధానకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో యూకే డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, ఐసీఐసీఐ బ్యాంకు యూకే సీఈఓ రాఘవ్ సింఘాల్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ అభిషిక్త్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ అంతర్జాతీయ కంపెనీలకు చెందిన 150 మంది సీఈఓలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కారును ఢీ కొట్టిన టిప్పర్.. నెల్లూరు జిల్లాలో ఏడుగురు దుర్మరణం

-మొదటిపేజీ తరువాయి

కారు నెల్లూరు నుంచి కడప వైపు వెళుతుండగా, టిప్పర్ రాంగ్ రూట్ లో వేగంగా రావటం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.కారును ఢీకొట్టిన అనంతరం టిప్పర్ కొంత దూరం వరకు కారును ఈడ్చుకెళ్లిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఓ చిన్నారితో పాటు ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారని విచారం వ్యక్తం చేశారు. టిప్పర్ కింద చిక్కుకోవడంతో కారులోని ప్రయాణికుల శరీరాలు నుజ్జునుజ్జయ్యాయని పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

**నెల్లూరు జిల్లా రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి**

నెల్లూరు జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఓ టిప్పర్ లారీ అదుపుతప్పి కారును ఢీకొట్టడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సంగం మండలం పెరమన వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఈ దుర్ఘటనలో ఓ చిన్నారి కూడా మృత్యువాత పడటం అందరినీ కలచివేస్తోంది. ఈ ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.వివరాల్లోకి వెళ్తే, సంగం మండలం పెరమన సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు మృతి చెందినట్లు సమాచారం. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. నెల్లూరు జిల్లాలో జరిగిన ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ విషయంలో మాతో ఎవరూ పోటీ పడలేరు

మొదటి పేజీ తరువాయి

చేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 ఆగస్టు నాటికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అమరావతిలోనూ అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఏపీలో ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి అన్నారు. దీని కోసం ఏపీలో లాజిస్టిక్స్ రంగంపై దృష్టి పెట్టామని పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైల్వేలను సమన్వయం చేస్తూ రవాణా వ్యయాన్ని తగ్గిస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. వ విశాఖ, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, కడపతో పాటు ఓర్వకల్లు, పుట్టపర్తి లాంటి చోట్ల విమానాశ్రయాలు రాష్ట్రాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తున్నాయని స్పష్టం చేశారు. త్వరలో అమరావతిలోనూ అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. హైదరాబాద్-అమరావతి-చెన్నైలను అనుసంధానిస్తూ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కూడా వస్తుందన్నారు. అమరావతి నగరాన్ని గ్రీన్ ఫీల్డ్ నగరంగా నిర్మిస్తున్నామని.., విజయవాడ-గుంటూరులను అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. టెక్నాలజీ పరంగా దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేస్తున్నట్టు వివరించారు. అలాగే డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేస్తున్నామని స్పష్టం చేశారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌర సేవలను అందిస్తున్నామని వివరించారు. సేవల నాణ్యత కోసం ప్రైవేటు కంపెనీల తరహాలోనే ఈ సేవలకు రేటింగ్ కూడా కోరుతున్నామని అన్నారు. అలాగే జీఎస్టీ స్లాబ్ లను తగ్గిస్తూ కేంద్రం తీసుకువచ్చిన సంస్కరణలు ఓ గేమ్ చేంజర్ గా మారనున్నాయని వివరించారు.

**ప్రధాని మోదీ దేశానికి పెద్ద ఆస్తి**

కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్‌తో రెండంకెల వృద్ధిని సాధించి తీరుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సరైన సమయంలో సరైన చోట సరైన నేతగా ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని, ఆయన దేశానికి అతిపెద్ద ఆస్తి అని కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, 2028 నాటికే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని అన్నారు

# లీకేజ్ లతో మద్యం ఆదాయానికి గండి ? వైసీపీ ఆరోపణలు..!

మొదటి పేజీ తరువాయి

వైసీపీ ఆరోపణలు గుప్పించింది. కాబట్టి ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ఎక్సైజ్ ఆదాయాల పెరుగుదల మునుపటి ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ఎక్సైజ్ ఆదాయాల కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుందని భావించినట్లు వైసీపీ తెలిపింది. కానీ 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయాలు రూ. 6,782.21 కోట్లుగా ఉన్నాయని, ఈ ఆర్థిక సంవత్సరం 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో అదే రూ.6,992.77 కోట్లుగా ఉందని కాగ్ గణాంకాలను విడుదల చేసిందని తెలిపింది. దీన్ని బట్టి చూస్తే ఎక్సైజ్ ఆదాయాల వృద్ధి కేవలం 3.10% మాత్రమేనని తెలిపింది. అన్ని విధాన మార్పులు చేయకపోయినా, సాధారణ సమయంలో దాదాపు 10% వరకు ఎక్కువ ఆదాయ వృద్ధి సాధించవచ్చని, కానీ భారీ అవినీతి కారణంగా రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లడం వల్ల ఆదాయాల లీకేజీ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోందని వైసీపీ ట్వీట్ చేసింది.

## ఇంటికీ ఆర్థిక మంత్రులు మహిళలే

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో భారత్ ను 11 వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో ఆర్థిక వ్యవస్థకు తీసుకువచ్చారని. 2047 నాటికి నెంబర్ వన్ గా తయారవుతామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ ఫైనాన్స్ మినిస్టర్ మహిళలే అని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సమస్యతో కుటుంబం మొత్తం మీద భారం పడుతుందని, అందుకోసం ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకు వస్తున్నామన్నారు. ఆడ బిడ్డల ఆరోగ్యం కోసం ఈ మెడికల్ క్యాంప్ ప్రారంభించామన్నారు. హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీ కోసం పని చేస్తున్నామన్నారు. విశాఖ ప్రజలు మంచి మనషులు అన్నారు చంద్రబాబు. వైజాగ్ సేఫెస్ట్ సిటీ ఇన్ ఇండియా అని, దేశంలో మంచి సిటీగా మారుతుందని పేర్కొన్నారు. మహిళలు ప్రతి రోజు ఒక అరగంట మన కోసం కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆయిల్, షుగర్, ఉప్పు తగ్గిస్తే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఆరోగ్యం కోసం రూ.20 వేల కోట్ల ఖర్చు పెడుతున్నామని, అందరికీ ఇన్సూరెన్స్ ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పుకొచ్చారు. ట్రీట్మెంట్ ఖర్చు కంటే హాస్పిటల్ ఖర్చు పెరుగుతోందన్నారు. బిల్గేట్ ఫౌండేషన్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో సంజీవని కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రాబాబు నాయుడు వెల్లడించారు.

## ప్రతిపక్షం గురించి మాట్లాడాలంటే బూతులొస్తున్నాయ్

మొదటి పేజీ తరువాయి

ట్యాక్సులుండేవని వాటిని సరిదిద్దలేదని విమర్శించారు. ట్యాక్స్‌లు కొన్ని సెక్షన్ లకు మాత్రమే వర్తిస్తే జీఎస్టీ 140 కోట్ల ప్రజల మీద ప్రభావం చూపించేదన్నారు. జీఎస్టీ 2.0 అమలు లోకి రాక ముందే ఆటో మొబైల్ ఇండస్ట్రీ ఆఫర్లు ప్రకటించడం కనిపిస్తోందన్నారు. నవరాత్రులు ప్రారంభం నుంచే కొత్త జీఎస్టీ విధానం పనిచేస్తుందని కేంద్రమంత్రి వెల్లడించారు. విస్తృతమైన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు అమలు చేయడం జరుగుతుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. 12 శాతం స్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులు 5 శాతం స్లాబ్ లోకి వచ్చేస్తున్నాయన్నారు. జీఎస్టీ రాకముందు 17 రకాల పన్నులు, 8 రకాల సెజ్‌లు ఉండేవన్నారు. 2017 లో 65 లక్షల మంది ట్యాక్స్ పేయర్స్ ఉండగా ప్రస్తుతం 1.51 కోట్ల మంది జీఎస్టీ పరిధి లోకి వచ్చారని చెప్పారు. న్యూ జెన్ ట్యాక్స్‌లో స్లాబ్స్ తగ్గించడం వల్ల రూ.2 లక్షల కోట్ల వరకు ప్రజల పై భారం తగ్గుతుందన్నారు. డెయిరీ ప్రొడెక్ట్స్ పై 5 శాతం నుంచి సున్నా శాతానికి ట్యాక్స్ చేశామన్నారు. నిత్యావసరాల్లో 99 శాతం వస్తువులు 5 శాతం పరిధి లోకి వస్తున్నాయని అన్నారు. మధ్య తరగతి ప్రజలకు కొత్త పన్ను విధానం చాలా ఊరటనిస్తుందని కేంద్రమంత్రి వెల్లడించారు. 5 పాలసీలు విధించుకున్నామని, మధ్యతరగతి నిత్యావసరాలు, గృహోపకరణాలు, రైతులు, ఎంఎస్ఎంఈలు, దేశానికి ఉపయోగమైన సెక్టార్లని దృష్టిలో పెట్టుకొని స్లాబుల్లో మార్పులు తీసుకొచ్చామని వివరించారు. గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని ప్రతిపక్షాలు ఆక్షేపిస్తున్నా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా సరళీకృతం చేశామని స్పష్టం చేశారు. 45 రోజుల్లోపు బిల్లులు చెల్లింపుల కోసం అన్ని విభాగాలను ఆదేశిస్తూనే ఉన్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లకు జీఎస్టీ మినహాయింపులు ఇవ్వమని పార్లమెంట్‌లో అడగ గలను కానీ.. ప్రజలకు అవసరమైన వ్యవహారాల పైనే దృష్టి సారించామన్నారు. ఎంఎస్ఎంఈలకు రావాల్సిన రీ ఫండ్ అమౌంట్ 90 శాతం వెంటనే వచ్చేస్తుందని, 90 శాతం ఇంపోర్టెడ్ డ్యూటీ ఫండ్‌ను సరళీకృతం చేశామని తెలిపారు. 144 వందే భారత్‌లు, 60 శాతం కంటే ఎక్కువ హైవేలు, విమానాశ్రయాలు రెట్టింపు, సంక్షేమ పథకాలు, రక్షణ వ్యవస్థ బలోపేతం ఇవన్నీ జీఎస్టీ సొమ్ముతోనే చేశామని చెప్పు కొచ్చారు. మన డబ్బుని సరిగ్గా వినియోగించే ప్రభుత్వం మనకి కావాలన్నారు. డీబీటీ ద్వారా రూ.3 లక్షల కోట్లు బోగస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఆదా చేశామన్నారు. జీఎస్టీ 2.0 తీసుకొస్తే ఎనిమిదేళ్లు ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేసినట్లు ఒప్పుకుంటున్నారా?, అని ప్రతిపక్షాలు మాట్లాడుతుండటం హాస్యాస్పదమని తెలిపారు. పదేళ్లు జీఎస్టీ తీసుకు రాకుండా కాలయాపన చేసిన యూపీఏ ప్రభుత్వానికి జీఎస్టీ పై మాట్లాడే అర్హత లేదన్నారు. వాళ్ల గురించి మాట్లాడాలంటే బూతులొస్తున్నాయంటూ వ్యాఖ్యలు చేశారు. రాజకీయంగా బదులిచ్చేందుకు సమయం ఉందన్నారు. ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్ల పై యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం పన్ను ఉంటే ఇప్పుడు 18 శాతానికి వచ్చిందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం ఎమ్మెల్యే వెలగపూడి హామీ



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**
భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఎమ్మెల్యే లకు వినతి పత్రాలు అందించిన ఏఐటియుసి నాయకులు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ఆధ్వర్యంలో, అధ్యక్షులు కోట. సత్తిబాబు, కార్యవర్గ సభ్యులు వైఎస్ మూర్తి, గరికిన నూకరాజు, శివారెడ్డి, బోర రమణ, గంరెడ్డి. సతీష్, సూరిబాబు రెడ్డి, అప్పలరాజు, నక్క వాసు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో పెండింగులో ఉన్న క్లైయిమ్ లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోఏ.పి.భవన, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమకు హక్కుగా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పెట్టుకున్న దాదాపు 50 వేల క్లైయిమ్ లు పెండింగులో ఉన్నాయి. 2019 సంవత్సరంలో జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ జీవో నెం: 1214 ను జారీ చేయడం వల్లనే కార్మికుల క్లైయిములు పెండింగులో ఉండిపోయాయి.
ఎన్నికల ముందు ఇదే విషయమై మా యూనియన్ తరపున కూటమి నాయకులకు పలు దఫాలు వినతిపత్రాలు ఇచ్చిన సంగతి తమకు గుర్తు చేస్తున్నాము. భవన ఇతర నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేస్తామని అప్పట్లో కూటమి హామీ ఇచ్చింది. దాంతో 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆశగా కూటమికి అనుకూలంగా ఓటు వేశారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 16 నెలలు గడిచింది. వెల్ఫేర్ బోర్డుకు ఇటీవల చైర్మన్ ను నియమించారు.కానీ పెండింగు క్లైయిముల పరిష్కారం మాత్రం జరగలేదు. దీని పై మేము రాష్ట్రంలో మంత్రులకు, శాసనసభ్యులకు ఇప్పటికే వినతిపత్రాలు ఇచ్చి యున్నాము. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో రెండుసార్లు, మండల కేంద్రాల్లో రెండుసార్లు ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి యున్నాము. పిజిఆర్ఎస్ లో ఫిర్యాదులు కూడా నమోదు చేసినామన్నారు. పెండింగు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి మా ఎఐటియుసి అనుబంధ సంఘం సభ్యులు వేలాది మంది పోస్టు కార్డుల ద్వారా కోరామన్నారు. మా యూనియన్ రాష్ట్ర నాయకత్వ బృందం కార్మికశాఖ మంత్రి ని, వెల్ఫేర్ బోర్డు చైర్మన్ ని బోర్డు సెక్రటరీ ని, లేబర్ కమిషనర్ ని కూడా స్వయంగా కలిసి విన్నవించామన్నారు.ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉన్నది. వెంటనే పెండింగు క్లెయిమ్ లను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నాము.
లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాల్సి ఉంటుందని ఇందుమూలముగా తెలియ పరచుచున్నాము. కార్మికుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని ఈ దిగువ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

**డిమాండ్స్**

1) వెల్ఫేర్ బోర్డులో పెండింగ్లో ఉన్న 50 వేల క్లెయిమ్ లను వెంటనే పరిష్కరించి దరఖాస్తు దారులకు సొమ్ము చెల్లించాలి.
2) కొత్త సభ్యుల నమోదు సరళతరం చేసి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలి. పాత కార్డులను కూడా రెన్యువల్ చేయాలి.
3)గత ప్రభుత్వం బోర్డు నుండి దారి మళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలి.
4) వెల్ఫేర్ బోర్డు పాలకమండలిలో కార్మిక సంఘాలకు ప్రతినిధుల కు ప్రాతినిధ్యం కల్పించాలిని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అన్ని రంగాలలో కార్మికుల సంక్షేమంతో పాటు ప్రత్యేకంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి మోదీ
ద్వారా కార్మికుల ప్రయోజనాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని. ఈ విషయమై ముఖ్యమంత్రి దృష్టికి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కార్మిక సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# సింగపూర్ లోని మండై వైల్డ్ లైఫ్ గ్రూప్‌ను సందర్శించిన - ఎంపీ శ్రీభరత్

## వన్యప్రాణి సంరక్షణలో ప్రపంచ స్థాయి పద్ధతులు విశాఖలో అమలు కోసం చర్యలు




**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ సింగపూర్ పర్యటనలో భాగంగా మండై వైల్డ్‌లైఫ్ గ్రూప్ సింగపూర్ జూను సందర్శించారు. ప్రపంచ ప్రఖ్యాత వన్యప్రాణుల నిర్వహణ పద్ధతులను అధ్యయనం చేసి, వాటిని విశాఖ జూ, కంబాల కొండ వన్యప్రాణి అభయారణ్యంలో అమలు చేసే అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండై వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈఓ మైక్ బార్క్లేతో ఎంపీ శ్రీభరత్ చర్చలు జరిపారు. నగరం లోనే అడవి వాతావరణాన్ని కల్పించడం, వన్యప్రాణుల సంరక్షణ ప్రమాణాలను మెరుగుపరచడం, సుస్థిర హరిత ప్రదేశాలను అభివృద్ధి చేయడం వంటి అంశాల పై చర్చించారు. విశాఖ వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉన్న స్థానిక మొక్కలతో హరితావరణాన్ని అభివృద్ధి చేయడం అవసరమని ఎంపీ పేర్కొన్నారు.
తరువాత సింగపూర్ లోని ప్రసిద్ధ నైట్ సఫారిని కూడా ఆయన సందర్శించారు.
పర్యాటకులకు ఇచ్చే అనుభవం, భద్రతా ప్రమాణాలు, జంతువులకు అనుకూల వాతావరణం వంటి అంశాలు విశాఖ వన్యప్రాణి పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటన ద్వారా విశాఖ జూ, కంబాల కొండలను ప్రపంచ స్థాయి ఎకో-టూరిజం హబ్‌లుగా మార్చడానికి అవసరమైన విలువైన సూచనలు అందాయి. జీవ వైవిధ్యం కాపాడుతూ సుస్థిర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తాం, అని ఎంపీ శ్రీభరత్ తెలిపారు.

# ఘనగా దుర్గాదేవి రాట మహోత్సవం



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**మండలం లోని భరిణికం గ్రామంలోశ్రీదుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా రాట స్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భరిణికం గ్రామంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రులు మహోత్సవ సందర్భంగా దుర్గాదేవి రాట మహోత్సవం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి భరిణికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు, రామలక్ష్మి, పెదిరెడ్ల శ్రీనివాసరావు, రాధ దంపతులు గ్రామ పెద్దలు, మహిళలు ఆధ్వర్యంలో రాట వుడుపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భరిణికం గ్రామ ప్రజల ఆశీస్సులతో గత కొన్నేళ్లుగా అమ్మవారి శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 22 వ తేది నుండి, వచ్చే నెల 2 తేది వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, కుంకుమ పూజలు, అభిషేకాలు పాటుగా, ఒక్కరోజు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రులు వేడుకల్లో పాల్గొని దుర్గాదేవి ఆశీస్సులు పొందాలని గ్రామస్తులను ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పొకల నీలకంఠ స్వామి, బొండా నర్సింగరావు, పెదిశెట్టి కనకమహాలక్ష్మి, ఇందల వరలక్ష్మి, దాసరి రమణమ్మ, సుంకరి చిట్టిమ్మ, బొండా సత్యవతి కమిటీ సభ్యులు బొండా నాని, బుద్దరాజు రాజ, మునాసాల కోటి, బొండా నాగార్జున, బొండా కొండలరావు, సట్టా శ్రీను, బొండా తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లయాష్ డంప్ యార్డు టెండర్లు రద్దు చేయాల్సిందే జోగి



**విజయవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** కృష్ణ జిల్లా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం లోని ఫ్లయాష్ (బూడిద) డంపింగ్ యార్డ్ టెండర్లలో అక్రమాలు జరిగాయని మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. ఈ డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాలు మొత్తం కాలుష్యం అవుతాయని అన్నారు. నేడు ఆయన ఆ బూడిద డంపింగ్ యార్డు సందర్శనకు వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేసిన పోలీసు స్టేషన్ కి తరలించారు. బుధవారం ఒంటి గంట సమయంలో భవానీపురం పోలీస్ స్టేషన్ నుంచి ఆయన విడుదల అయ్యారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ వీటీపీఎస్‌లో ఫ్లయాష్ టెండర్లు రద్దు చేయాలని, అక్రమంగా బూడిద నిల్వ చేసి హైదరాబాద్‌కి తరలించే ప్రక్రియను నిలిపివేయాలని మాజీ మంత్రి జోగి రమేష్ డిమాండ్ చేశారు. ఈ బూడిద డంపింగ్ యార్డు వల్ల ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని గ్రామాల్లో నీరు, గాలి కాలుష్యం బారిన పడే అవకాశం ఉంది. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా దెబ్బ తింటాయి. కాలుష్యం నుంచి సురక్షితంగా ఉండాలంటే చెట్లను పెంచాలి. తక్షణమే అక్రమ డంపింగ్ ను స్వాధీనం చేసుకోకపోతే మా పోరాటం కొనసాగిస్తాం అని ఆయన హెచ్చరించారు. లోకల్ లారీ ఓనర్స్ ను ఆదుకునే విధంగా టెండర్లు రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. అలాగే, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెబితే మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారని జోగి రమేష్ మండిపడ్డారు.

# అభివృద్ధి, సంక్షేమాలకు కూటమి ప్రభుత్వం పెట్టింది పేరు...

## తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**రాష్ట్రంలో కొలువు దీరిన తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాలకు పెట్టింది పేరని విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు పేర్కొన్నారు. నగరం లోని జీవీఎంసీ 20 వ వార్డులో 2 కోట్ల 55 లక్షల విలువ చేసే పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజా రంజకంగా పరిపాలిస్తూ అభివృద్ధి, సంక్షేమాల పై పూర్తి దృష్టి పెట్టిందన్నారు. తూర్పు నియోజక వర్గంలో కాలువలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి కూటమి నాయకుల సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్న రెడ్డి, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కంభాపు శివారెడ్డి, తూర్పు నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ మురళి మోహన రాజు, బీజేపీ నాయకుడు అనిల్ కుమార్, జనసేన నాయకులు పండా శ్రీను, నీలాపు రమణ, వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మ కర్తల మండలి చైర్మన్ బైరెడ్డి గోవింద రెడ్డి, టీడీపీ నాయకులు చిన్నపిల్లి రామారెడ్డి, గొరుసు అప్పల రెడ్డి, 17 వ వార్డు టీడీపీ సీనియర్ నాయకుడు కాళ్ళ శంకర్, చితపాన రాజ్య లక్ష్మి, నీలాపు చంద్ర లేఖ, మద్ది శ్రీనివాసరెడ్డి, పి.వాసు, పి.శ్రీను, కాకి శివారెడ్డి, చల్లా గోపి, గొర్లె దేముడు బాబు, చిన్నపిల్లి నరేంద్ర, జీవీఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75 వ పుట్టినరోజు వేడుకలు



**మునగపాక, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**బిజెపి మండల అధ్యక్షుడు మల్ల కాళీశ్వరరావు ఆధ్వర్యంలో మునగపాక గ్రామంలో ఎంపీయుపి స్కూల్లో నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి, అక్టోబర్ 2 వరకు సేవ పక్షోత్సవాల్లో భాగంగా ఎంపీయుపి స్కూల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం, నరేంద్ర మోదీ అమ్మగారి (హేరాబెన్) పేరున మొక్క నాటే కార్యక్రమం జరిగినది. తదనంతరం స్కూల్ పిల్లలకి బుక్స్, పెన్సిల్స్, స్నాక్స్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాము, తెలుగుదేశం సీనియర్ నాయకులు దాడి ముసలి నాయుడు, బిజెపి సీనియర్ నాయకులు బద్దం సూర్యనారాయణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బోడ్డెడ భాస్కరరావు, మాజీ మండల అధ్యక్షులు ఎల్లప్ప రాజేశ్వర రావు, దొడ్డి సత్యనారాయణ, సీనియర్ నాయకులు వేగి అప్పలనాయుడు, మల్ల మల్లయ్య నాయుడు, కన్న అప్పారావు, మొల్లేటి జగదీశ్వర రావు, కాంగ్రేగులు గణేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర కామాక్షి సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు.







**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**మేజర్ పంచాయతీ పరవాడలో విశ్వకర్మ జయంతి ఈ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పరవాడలో ఉన్న స్థానిక రామాలయంలో పరవాడ వీరబ్రహ్మేంద్ర కామాక్షి సేవా సంఘం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా పుణ్యాహవచనం, నవగ్రహా రాధన, వాస్తుఇత్యాది, పూజాక్రతువులను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ వేడుకల్లో జనసేన పార్టీ మండల ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్, పరవాడ గ్రామ సర్పంచ్ సిరపురపు అప్పల నాయుడు, ఎంపీటీసీ సభ్యులు పయిల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు, పయిల సన్యాసిరావు మాస్టర్, పయిల అక్కు నాయుడు, పయిల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, బండారు రాజు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల ప్రసాద్ మాట్లాడుతూ సృష్టికి పూర్వమే విశ్వకర్మ నిర్గుణాకారంలో ఉద్భవించారన్నారు. పంచభూతాలు ఏర్పడక ముందే విశ్వకర్మ ఉద్భవించారని శ్రీకృష్ణుడికి ద్వారకను, ధర్మరాజుకు ఇంద్రపస్థను, శివుడికి స్వర్ణలంకను నిర్వహించిన విశ్వకర్మ ప్రసిద్ధి చెందారని గుర్తు చేశారు. ఆదిదేవుడుగా విశ్వకర్మ పూజలు అందుకుంటున్నారన్నారు. భారత ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి విశ్వకర్మ యువజన పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్ర కామాక్షి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా విశ్వకర్మ జయంతి



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని విశ్వకర్మ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు మాట్లాడుతూ, విశ్వకర్మ జయంతి కృషి, నైపుణ్యం, క్రమశిక్షణతో పనిని ఆరంభించి విజయాన్ని సాధించాలనే స్ఫూర్తినిస్తుందన్నారు. విశ్వకర్మ కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి ప్రేరణ అని తెలిపారు.

## సంస్కృతిలో రైఫిల్ షూటింగ్, వుషు, ఎంపికలు





**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** అనకాపల్లి డి.ఈ.ఓ జి.అప్పారావు నాయుడు ఆదేశాలు మేరకు విశాఖ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14,17 రైఫిల్ షూటింగ్, వుషు, ఎంపికలు సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు జరిగాయి. ఈ ఎంపికలు సుమారుగా 120 మంది పాల్గొనగ. ఇందులో ఎంపిక అయినా క్రీడాకారులు అండర్ -14,17 విశాఖ ఉమ్మడి జిల్లా జట్టుగా రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ సెక్రటరీ కె. ఎమ్ నాయుడు తెలిపారు. ఈ పోటీలను సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సీఈఓ కె. నిశాంత్ ప్రారంభించగా జి రాజు అబ్జర్వర్ గా వ్యవహరించారు.
ప్రత్యేక ఆహ్వానితులు గా విచ్చేసిన
మాజీ ఎస్ జి ఫ్ సెక్రటరీ వి.నాగేశ్వరావు గత అనుభవాలా దృష్ట్యా ఎంపిక అయినా క్రీడాకారులు దరఖాస్తు చెయ్యు విధానంను కూలం కూషంగా వివరించారు. సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు నిర్వహించుటకు అవకాశం కల్పించిన యాజమాన్యంకు, కోచ్ లు రామ్మోహన్, రమ్య, లకు కృతజ్ఞతలు తెలిపారు.

# నరేంద్ర మోధీ జన్మదినం సందర్భంగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**భారత ప్రధాని నరేంద్ర మోధీ 75 జన్మదినం సందర్భంగా పరవాడ బిజెపి నాయకులు కూండ్రపు సోము నాయుడు ఆధ్వర్యంలో అనిత ఆప్టికల్స్, శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం వారిచే నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వహించిన ఈ శిబిరానికి
భారీ స్పందన లభించిందని సోము నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటలకే వివిధ ప్రాంతాలనుండి ప్రజానీకం కంటి పరీక్షలు చేయించు కోవడానికి తరలివచ్చారు. వారందరికీ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి 120 మంది హాజరుకాగా వారిని పరీక్ష చేసిన అనంతరం ఉచితంగా మందులు ఇచ్చి ఆపరేషన్ అవసరమైన వారికి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కూండ్రపు సోము నాయుడు మాట్లాడుతూ త్యాగం, అంకితభావానికి చిహ్నం, కోట్లాది మంది దేశ ప్రజల ప్రేమను పొందుతున్న ప్రధాని మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా దేశ ప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. నేషన్ ఫస్ట్ అనే మీ నినాదం ప్రతి పౌరుడికి ప్రేరణ అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75 వ జన్మదిన వేడుకలను దేశవ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకుంటున్నారు అని అన్నారు. భారత్ ను ఒక గ్లోబల్ సూపర్ పవర్ గా మార్చేందుకు ప్రధాని మోదీ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని అన్నారు. భారత భవిష్యత్తు కోసం ఇంతలా శ్రమించే నాయకుడిని తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. మోదీ యావత్ భారతదేశాన్ని ప్రపంచ శక్తిగా మారుస్తున్నారని ప్రశంసించారు. ఆయన నిండు ఆరోగ్యంతో ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిత ఆప్టికల్స్ గోపి, బిజెపి నాయకులు బొడ్డు కోటి బాబు, బ్యాడ్ బాయ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల వారికి ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** గన్నవరం నియోజకవర్గం లోని ప్రత్యేక అవసరాలు గల వారికి రూ. 12.60 లక్షల విలువ గల బ్యాటరీతో నడిచే 23 ట్రై సైకిళ్లను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా గన్నవరం నియోజకవర్గం లోని పలు గ్రామాలలో యార్లగడ్డ పర్యటించిన సమయంలో ప్రత్యేక అవసరాలు గలవారు తమకు ట్రైసైకిళ్ళు ఇప్పించాలని యార్లగడ్డ ను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావ్ వీరికి ట్రై సైకిళ్ళు మంజూరు అయ్యేలా తగు చర్యలు తీసుకువాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు నియోజకవర్గం లోని ట్రై సైకిళ్లు అవసరమైన వారి వద్ద దరఖాస్తులు సేకరించిన ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సేకరించిన దరఖాస్తులకు ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫారసు లేఖ ను జత చేసి ఈ దరఖాస్తులను వికలాంగుల సంస్థకు పంపించి వీరికి ట్రై సైకిళ్ళు మంజూరు చేసే వరకు నిరంతరాయంగా సంప్రదిపులు జరిపారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు బాపులపాడు మండలంలో ఇద్దరికీ, విజయవాడ రూరల్ మండలంలో నలుగురికి, గన్నవరం మండలంలో 13 మందికి, ఉంగుటూరు మండలంలో నలుగురికి మొత్తం 23 మందికి ఒక్కొక్కటి రూ. 60 వేల విలువ చేసే బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్ళను వికలాంగుల సంస్థ మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎనికేపాడు లోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకట్రావు లబ్ధిదారులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీర్చడంలో కుటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల ఆశయాలు ఆకాంక్షల మేరకు తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం, బాపులపాడు, విజయవాడ రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు వరుసగా గూడపాటి తులసి మోహన్, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డళ్ళ చిన్న రామారావు, టిడిపి నాయకులు మేడేపల్లి రామ, యనమదల సతీష్, బోడపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరాలను మహిళలు ఉపయోగించుకోవాలి ఎంపీ పుట్టా

- **ప్రధానికి మోదీ కి జన్మదిన శు భాకాంక్షలు పుట్టా.**
- **గత పదేళ్లలో దేశంలో ప్రసూతి మరణాలు తగ్గాయి.**
- **మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.**
- **తల్లి-బిడ్డ పోషకాహారం పై అవగాహన రావాలి.**
- **గర్భిణులు, బాలింతలు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించు కోండి.**



**ఏలూరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** సమాజంగానీ, దేశంగానీ పురోగతి సాధించాలంటే ముందు మన కుటుంబాలలో మహిళలు బాగుండాలన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. అటువంటి మహిళల కోసం మన ప్రధాని మోదీ 'స్వస్థ్ నారి, సశక్త్ పరివార్ అభియాన్' (ఆరోగ్యవంతమైన మహిళ, సాధికార కుటుంబం) అనే దేశవ్యాప్త కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించారన్నారు. అక్టోబర్ 2, గాంధీ జయంతి వరకు జరిగే ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులకు మెరుగైన ఆరోగ్య సేవలు, సంరక్షణ పై అవగాహన కల్పిస్తారని , దేశవ్యాప్తంగా నిర్వహించే ఆరోగ్య శిబిరాలలో అనేక ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, వీటిని మహిళలంతా ఉపయోగించు కోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఇందులో భాగంగా హైపర్ టెన్షన్, డయాబెటిస్ కోసం స్క్రీనింగ్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ కోసం స్క్రీనింగ్, కౌమార బాలికలు, మహిళలకు రక్తహీనత స్క్రీనింగ్, కౌన్సిలింగ్, క్షయవ్యాధి పరీక్షలు, గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ డిసీజ్ (ఎస్.సి.డి) స్క్రీనింగ్, ఎస్.సి.డి
కార్డుల పంపిణీ చేస్తారని ఎంపీ వెల్లడించారు. ఈ ఆరోగ్య శిబిరాల్లో గైనకాలజిస్ట్, కంటి నిపుణుడు, ఈఎన్టి స్పెషలిస్ట్, చర్మవ్యాధి నిపుణుడు, మానసిక వైద్యుడు, దంత వైద్య నిపుణుడు వంటి వారు అందుబాటులో ఉంటారన్నారు. దీనితో పాటు రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు కూడా నిర్వహిస్తున్నారని, దీనిలో భాగంగా తల్లి-బిడ్డ తీసుకోవాల్సిన పోషకాహారం పై అవగాహన కల్పిస్తారని మహిళలంతా దీనిలో భాగస్వాములు కావాలని ఎంపీ కోరారు. 2014 తో పోల్చితే 2021 నాటికి భారతదేశంలో ప్రసూతి మరణాల రేటు ( ఎంఎంఆర్) లక్షకు 130 నుండి 93కి తగ్గింది. అలాగే, శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్) వెయ్యికి 26 నుండి లో 19 కి తగ్గిందని, ఇది ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం సాధించిన పురోగతికి నిదర్శనం అన్నారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ తన పుట్టినరోజునే ఈ ఆరోగ్యవంతమైన మహిళ, సాధికార కుటుంబం కార్యక్రమం ప్రారంభించడం మహిళల సంక్షేమం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. సెప్టెంబర్ 17 నుంచీ, అక్టోబర్ 2 వరకూ జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఒక లక్షకు పైగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని, ఏలూరు పార్లమెంట్ పరిధిలో కూడా ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమాలు మహిళలకు వరం వంటివని, వీటికి హాజరై, వైద్యులు ఇచ్చే సూచనలను పాటిస్తూ ఆరోగ్యకరమైన కుటుంబం, ఆరోగ్యకరమైన సమాజం దిశగా ముందడుగు వేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ కి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ప్రపంచ వేదిక పై భారత్ ను బలమైన దేశంగా నిలబెడుతున్న మోదీ నాయకత్వం దేశానికి ఎంతో అవసరమని, కోట్లాదిమందికి స్ఫూర్తినిస్తూ, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్ళు జీవించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

# వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో పెమ్మసాని





**గుంటూరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**స్థానిక శంకరన్ మీటింగ్ మినీ హాల్లో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యూరియా కొరత, సాయిల్ టెస్టులు, తక్కువగా జరుగుతున్న ఈ క్రాప్ నమోదు తదితర అంశాల పై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి. రామాంజనేయులు తో కలిసి పెమ్మసాని ఈ రివ్యూ సమావేశం నిర్వహించారు.

కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ

వ్యవసాయ సమస్యలు, ఇబ్బందుల పై అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించామన్నారు. ఈ ప్రాంతంలో యూరియా సరఫరా 24 వేలు మెట్రిక్ టన్నులు అవసరం అయితే 26,000 ట్రిక్ టన్నులు అందించాం అన్నారు.

కనుకనే సమస్యలు ఎందుకు వచ్చాయని పరిశీలిస్తే, వర్షాలు అధికంగా పడటం వల్ల యూరియా కొట్టుకుపోయి అధిక అవసరం ఏర్పడింది అని తెలుస్తోంది.

దీనికి తోడు కొన్ని పత్రికల్లో వచ్చిన యూరియా కొరత అనే ప్రచారం వల్ల రైతాంగం కంగారుపడి అధిక కొనుగోళ్ళు చేయడం కూడా ఒక కారణం అని చెప్పాలి. రాబోయే సంవత్సరం అయినా ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా మార్క్ ఫెడ్ నుంచి అధికంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కౌలు రైతులు ఎక్కువగా ఉండటం వల్ల వారిలో ఎవరెవరు యూరియా తీసుకుంటున్నారు అనేది తెలియడం లేదు. ఓటిపి మెకానిజం ద్వారా ఒరిజినల్ కౌలుదారులకు యూరియా అందేల చర్యలు తీసుకోబోతున్నాం.

ఇప్పటివరకు 13 వేల సాయిల్ టెస్టులు చేశామని అధికారులు చెబుతున్నారు.

అయితే చాలా చోట్ల సాయిల్ టెస్టులు పూర్తిస్థాయిలో జరగడం లేదు.

నూతన సాంకేతిక విధానం ద్వారా సాయిల్ టెస్టులు జరిగేలా చర్యలు తీసుకోబోతున్నాం. ప్రధానమంత్రి ఫసల్ బీమా ద్వారా రైతులకు బీమా సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోబోతున్నాం.

90 శాతం మంది రైతులు ఇన్సూరెన్స్ కు అప్లై చేయలేకపోతున్నారు. దానికి గల కారణాల పై వివరాలు సేకరిస్తున్నాము. త్వరలోనే పరిష్కార మార్గాలు కనుగొని తగు చర్యలు తీసుకుంటాము. సంబంధిత సమస్యలు, ఇబ్బందుల పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి వ్యవసాయ శాఖ మంత్రి కి లేఖలు రాసి పరిష్కార మార్గాలు చూపిస్తాము. అనంతరం ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ యూరియా సమస్యలు ఉన్నాయన్న వార్త కథనాల పై స్పందిస్తూ వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించాము. అయితే యూరియా కొరత అనేది కేవలం ఊహాజనితం మాత్రమే. లక్ష్యానికి మించి 2000 మెట్రిక్ టన్నులు అధికంగా గుంటూరు జిల్లాలో యూరియా సప్లై జరిగింది. గుంటూరు జిల్లాలో యూరియా కొరత లేదు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అష్టోష్ శ్రీ వాత్సవ, అగ్రికల్చర్ జె.డి నాగేశ్వరరావు, డిస్టిక్ లెవెల్ మేనేజర్ మహిపాల్, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెదబోదుగలం పునరావసం కాలనీ పనులు వేగవంతం చేయాలి

## పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టంబర్ 17:** నక్కపల్లి మండలం పెదబోదుగల్లం గ్రామం వద్ద గల పునరావసం కాలనీ ని బుధవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తో కలిసి పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.యువరాజ్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులు పురోగతిని గూగుల్ మ్యాపు ద్వారా క్షేత్ర స్థాయి సందర్శన చేసి పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు. ఎలక్ట్రిసిటీ, డ్రింకింగ్ వాటర్, డ్రమ్స్, రోడ్స్ వంటి మౌళిక సదుపాయాలు కల్పించడం పై దృష్టి పెట్టాలన్నారు. సకాలంలో పనులు పూర్తి కావాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఇళ్ల స్థలాలు పొందిన గ్రామాలకు చెందిన నాయకులతో మాట్లాడి వారి మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరతిగతిన పూర్తి చేసి ప్రజలకు అప్పగించాలంటూ గుత్తేదారులకు పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి స్పష్టం చేశారు. ఇప్పుడు కుటుంబ పెద్దలకు పరిహార నగదు జమ చేసామని మిగిలిన వారికి త్వరలో ఇస్తామని, ఇచ్చిన సొమ్ము వృధాగా ఖర్చు కాకుండా ఉపయోగించాలని కలెక్టర్ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి.విరమణ , జోనల్ మేనేజర్ ఎపిఐఐసి నరసింహం, తహసీల్దారు నరసింహమూర్తి , ఎంపీడీవో సీతారామరాజు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటిపారుదల, విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజనీర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జనసేన లోకి వైయస్సార్సీపీ ఎంపీటీసీ





అచ్యుతాపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:మండలం ఎస్ టి బి ఎల్ ఎమ్మెల్యే నివాసం వద్ద జనసేన ఎమ్మెల్యే సందరపు విజయ్ కుమార్ ఆహ్వానం మేరకు హరిపాలెం వైయస్సార్సీపీ ఎంపీటీసీ శరగడం ప్రసాద్, శరగడం లాయర్ అప్పల నాయుడు తన అనుచరులతో కలిసి 200 మందితో జనసేన లోకి చేరారు. బుధవారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే సందరపు విజయకుమార్ వైయస్సార్సీపీ నాయకులకు జనసేన కండువాలు వేసి స్వాగతించారు. అనంతరం విజయ్ కుమార్

మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ప్రజల అభిమానం పొందిన నాయకులు జనసేనలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు.

జనసేనలో చేరిన శరగడం ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తీసుకుని సేవ చేయడానికి జనసేననే సరైన వేదిక అని భావించి పార్టీ లోకి వచ్చినట్లు తెలిపారు. ఆయనతో పాటు అనుచరులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. జనసేనలో చేరిన కొత్త నాయకులను ఎమ్మెల్యే విజయకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎం.పీ కార్యాలయం లో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు.

ఎంపీ సి.ఎం. రమేష్ పిలుపు మేరకు రక్తదాన శిబిరం

బీజేపీవైఎం జిల్లా అధ్యక్షులు గేదెల స్వరూప్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు

యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేయడం అభినందనీయం

ముఖ్య అతిధిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్.






**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**భారత మాతా ముద్దు బిడ్డ, మన దేశాన్ని విశ్వ గురు గా తీర్చిదిద్దిన దేశ ప్రియతమ నేత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎంపీ డాక్టర్ సి.ఎం. రమేష్ పిలుపు మేరకు బీజేపీవైఎం జిల్లా అధ్యక్షులు గేదెల స్వరూప్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమనీకి ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్, జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు హాజరయ్యారు. కార్యక్రమంలో స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో యువకులు రక్తదానంలో పాల్గొన్నారు. అదేవిధంగా అధిక సంఖ్యలో భారతీయ జనతా పార్టీ నాయకులు,కార్యకర్తలు హాజరై మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కి రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలతో బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలియ జేయడం అత్యంత గౌరవప్రదంగా ఉందని, నాయ కులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా అభినం దనలు తెలియ జేశారు. మన ప్రధాని దేశం కోసం చేస్తున్న కృషి ప్రతి భారతీయుడికి ప్రేరణ అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా ముందుకు నడుపు తున్న ప్రపంచం లోనే అత్యంత శక్తివంత నాయకుడు కు ఆయురారోగ్యాలు ఇవ్వాలని దేవుడిని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. జిల్లా అధ్యక్షుల ద్వారపురెడ్డి పరమేశ్వరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పుట్టిన రోజు వేడుకకు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా అభినందించి, వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా బీజేపీవైఎం జిల్లా అధ్యక్షులు గేదెల స్వరూప్ మాట్లాడుతూ గౌరవ పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ ఆదేశాల మేరకు పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని, క్యాంపు కార్యాలయం లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం మహోన్నతమైన సేవాతత్వంతో కూడిన కార్యక్రమం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వంగా ఉందని తెలిపారు. మోదీ ఆరోగ్యం, ఆయుష్షు కాంక్షిస్తూ యువతతో కలిసి ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఆనందంగా ఉంది పేర్కొన్నారు. కార్యక్రమం లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, కూటమి నాయకులు కార్యకర్తలు, క్యాంపు కార్యాలయ సిబ్బంది, అధిక సంఖ్య లో యువకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో సుందరపు



**మునగపాక, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**మండలం లోని ప్రభుత్వ ఆస్పటల్ లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం కోసం, బలమైన కుటుంబాల కోసం, మహిళలు ఆరోగ్యం ఎంతో ముఖ్యం అన్నారు. మీ ఆరోగ్యం కోసం రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ తదితర పరీక్షలు క్రమం తప్పకుండా చేంచుకోవాలి అన్నారు. పోషణ అభియాన్ అభియాన్ లో చేరి సరైన ఆహారం తీసుకోవాలన్నారు. రొమ్ము క్యాన్సర్, తల్లి బిడ్డ సేవలు,గర్భాశయ క్యాన్సర్, వయోవృద్ధుల కిడ్నీ ఆరోగ్య పరీక్షలు నియోజకవర్గంలో ప్రజలందరూ చేయించు కోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆశా వర్కర్లు జనసేన, టిడిపి, బిజెపి నాయకులు తదిరులు పాల్గొన్నారు. అనంతరం అచ్యుతాపురం మండలంలో ప్రభుత్వాసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలుత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళలు వ్యక్తిగత అవసరాల కోసం ప్రతీ 5 నుంచి 10 కిలో మీటర్లకు ఒక మహిళా కేంద్రం వంటిది పెట్టి ఆ కేంద్రాల్లో వారికి పర్సనల్ అవసరాలను తీర్చుకోడానికి సి.ఎస్.ఆర్ ఫండ్స్ ద్వారా వసతులు కల్పించడానికి జిల్లా కలెక్టర్ తో చర్చలు జరుపుతున్నారు.

# ఏపీఐఐసి భూములను పరిశీలించిన ఎన్.యువరాజ్, జిల్లా కలెక్టర్



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామంలో ఉన్న 737 సర్వే నంబర్లు గల ఏపీఐఐసి ప్రభుత్వ భూములను బుధవారం పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తో కలిసి పరిశీలించారు. ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న 290 ఎకరాలకు సంబంధించిన భూములు, 737 సర్వే నంబర్ లో ఉన్న 400 ఎకరాల భూమి మ్యాపును పరిశీలించారు. అనంతరం మాకవరపాలెం నుంచి ఎలమంచిలి నియోజకవర్గం వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎమ్ఎస్ఎమ్ఇ)పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఏపీఐసీసీ భూముల్లో భారీ పారిశ్రామిక కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన భూమిలో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే కంపెనీలకు సరిపడేంత వాటర్ సోర్స్ కూడా ఈ ప్రాంతంలో ఉందని తెలిపారు. ప్రస్తుతం రైతులకు సంబంధించిన జిరాయితీ భూములు ఏవైతే ఏపీఐఐసీ రికార్డులో నమోదయి ఉన్నాయో వాటిని నెల రోజుల్లో తొలగించి రైతుల పేరున ఆన్లైన్ చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ కు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి.విరమణ, జోనల్ మేనేజర్ ఎపిఐఐసి నరసింహం, తహసీల్దారు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** భారతదేశ గర్వకారణం, ప్రజల ప్రియతమ నాయకుడు, విశ్వనేత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు. సంఘర్షణలతో ముందుకు సాగుతూ, సేవతో జీవితం గడుపుతూ, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తూ భారత్ ను మహా శక్తిగా నిలిపిన మహానేత నరేంద్ర మోదీ దేశానికి వరప్రసాదం అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ పుట్టినరోజు సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన అసమాన నాయకత్వాన్ని కొనియాడారు. మోదీ దూరదృష్టి వలన భారత్ నేడు ప్రపంచ వేదిక పై గర్వంగా నిలుస్తోంది. గర్వకారణమైన ఆర్థిక సంస్కరణలు, పేదల సంక్షేమం, శక్తివంతమైన రక్షణ వ్యవస్థ, పారదర్శక పాలన %-% ప్రతి రంగం లోనూ మోదీ ఒక కొత్త యుగాన్ని ప్రారంభించారు అని ప్రశంసించారు.

దేశం కోసం జీవించేవారు, ప్రజల కోసం నిద్రలేని రాత్రులు గడిపేవారు, భారతమాత పట్ల అచంచల భక్తితో పనిచేసే మహానుభావుడు నరేంద్ర మోదీ. ఆయన చేతుల్లో భారత్ సురక్షితం, శక్తివంతం, సమగ్రాభివృద్ధి వైపు దూసుకుపోతుంది అని అన్నారు.

భారత్‌ను విశ్వగురుగా నిలపాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న మోదీ కి మరింత ఆయురారోగ్యాలు కలగాలని, దేశాన్ని ఇంకా ఎన్నో శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.



మోదీ కేవలం నాయకుడు మాత్రమే కాదు, ప్రతి భారతీయుడి గుండెల్లో ఒక స్ఫూర్తి, ఒక ఆరాధ్యుడు, ఒక జాతిపిత స్థాయి నాయకుడు. ఆయన నాయకత్వం లోనే భారత్ ప్రపంచానికే మార్గదర్శకత్వం వహిస్తుందని నమ్ముతున్నాను అని మంత్రి అచ్చెన్నాయుడు గర్వంగా పేర్కొన్నారు.

## ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

కూటమి వచ్చాక 19 దఫాలుగా రూ.3.70 కోట్ల చెక్కుల పంపిణీ.



**రావులపాలెం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు అండగా నిలుస్తున్నారని, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించడంలో దేశం లోనే ముందున్నారన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాలకు కలిపి మొత్తం 40 మందికి రూ.19,64,157లు నేడు సహాయంగా అందించామని తెలిపారు. కూటమి అధికారం లోకి వచ్చాక గత 15 నెలల కాలం లోనే 19 దఫాలుగా 474 మందికి రూ. 3.70 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ నెలలో గత పదిహేను రోజుల్లో సహాయనిధి చెక్కుల పంపిణీ జరగడం ఇది రెండవ సారని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 8 మందికి రూ.3,24,513లు, రావులపాలెం మండలానికి చెందిన 13 మందికి రూ.6,20,484లు, కొత్తపేట మండలానికి చెందిన 12 మందికి రూ.5,83,396లు, ఆలమూరు మండలానికి చెందిన 7 గురికి రూ.4,35,764లు మొత్తం 40 మందికి రూ.19,64,157ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

## ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు





**తణుకు, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా తణుకు పట్టణం మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి, మున్సిపల్ కార్మికులకు ఆహారం అందించడం జరిగింది. అత్యంత పేదరికం నుండి గొప్ప స్థాయికి ఎదిగిన మోదీ జీవితం మనందరికీ ఆదర్శమే. మోదీ జన్మదినం సందర్భంగా ఆయనను స్ఫూర్తిగా తీసుకుని జీవితాన్ని నిర్మించుకుందాం అని పిలుపునివ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వకర్మ సేవలు ఆదర్శనీయం జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టంబర్ 17:** విరాట్ విశ్వకర్మ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి చేసిన సేవలు ఆదర్శనీయ మని జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి అన్నారు. బుధవారం ఉదయం కలక్టరేట్ సమావేశ మందిరంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని తెలిపారు. ప్రధానంగా కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప కంచరీ తదితర వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేలా ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రపంచపు తొలి వాస్తు శిల్పిగా, సృష్టికర్తగా పేరు గాంచిన విరాట్ విశ్వకర్మను పూజించడం ద్వారా ప్రజలు విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారని వివరించారు. విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వై.సత్యనారాయణ రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.శ్రీదేవి, ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యులు, కలక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, సూపరింటెండెంట్లు, పలువురు కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో తొలి వాస్తు శిల్పి, సృష్టికర్త విశ్వకర్మ

విశ్వకర్మ జయంతి వేడుకలలో

జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్



**పాడేరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**ప్రపంచంలో తొలి వాస్తు శిల్పి, సృష్టికర్త విశ్వకర్మ అని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మ పూజప్రాముఖ్యతను వివరించారు. విశ్వ కర్మ జయంతి, విశ్వకర్మ పూజను తయారీ దారులు, ఇంజనీర్లు, జరుపుకుంటారన్నారనీ, కార్మికులు, పరిశ్రమలలో పనిముట్లకు విశ్వకర్మ జయంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారునీ బి సి జిల్లా వెల్ఫేర్ అధికారి వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మాలత, బి సి వెల్ఫేర్ అధికారి ఆర్. కృష్ణారావు, విశ్వసంఘం ప్రెసిడెంట్ కొమ్ముజి వెంకట రమణ, అరకు పార్లమెంట్ బి.సి. సెల్ ఉపాధ్యక్షులు ఎల్ నాగభూషణం, వేమూరి సత్తిబాబు, కె లతాకుమారి, బి తేహజారాణి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

## కామాక్షి ఆలయంలో విశ్వకర్మ జయంతి పూజలు



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**గవరపాలెంలో కొలువైన కామాక్షి ఆలయంలో విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం ఆలయ మండపంలో విశ్వకర్మకు ఉత్సవ విగ్రహానికి కోరుకొండ వెంకటరావు నూకేశ్వరీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథం పై విశ్వకర్మను విగ్రహానికి అలంకరణ చేశారు. ఈ ఊరేగింపులు అనకాపల్లి బంగారు వర్తకల సంఘం అధ్యక్షులు కొణతాల రాజేంద్ర ప్రారంభించారు. ఆలయం వద్ద నుండి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుతో అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి చేరుకుంది. అనంతరం కామాక్షి కార్పొరేటర్ సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. తిరిగి రథోత్సవం కామాక్ష ఆలయానికి చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్య నరసింహ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాసరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జనవాణి కార్యక్రమంలో సుందరపు

**యలమంచిలి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జనవాణి కార్యక్రమంలో వినతులు స్వీకరించిన శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్. బుధవారం ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులతో కలిసి సుందరపు పాల్గొన్నారు. జనవాణి కార్యక్రమంలో పిర్యాదు దారుల పిర్యాదులు పై అధికారులు అందుబాటులో ఉండడంతో అక్కడే పరిష్కరించేందుకు శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ చొరవ చూపారు. తమ వ్యక్తిగత సమస్యలు ఎమ్మెల్యే వెంటనే పరిష్కారం చూపడం తో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జరిగిన జనవాణి ప్రభుత్వ అధికారులు అంతా శాసనసభ్యులు చాంబర్లోనే అందుబాటులో ఉండటం వల్ల సమస్యల పరిష్కారం సత్వరం కావడం విశేషం. రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాల అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికంగా మున్సిపాలిటీ నుండి అర్జీలు రావడంతో కమిషనర్ ప్రసాదరాజు తో మాట్లాడి సమస్యల పై విజయ్ కుమార్ అడిగి వెంటనే పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తరాంధ్ర సమన్వయకర్త సుందరపు సతీష్, కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## విశ్వకర్మ జయంతి వేడుకలలో కలెక్టర్, ఎమ్మెల్యే



**రాజమహేంద్రవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న విశ్వకర్మ జయంతి వేడుకలలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దైవిక వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## విశ్వకర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత జిల్లా కలెక్టర్



**గుంటూరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**జిల్లా చేతివృత్తుల కళాకారు లైన విశ్వకర్మల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొని విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఘనంగా జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలలు



**విజయనగరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులకు సమాజంలో ఎల్లప్పుడూ విశేష గౌరవం ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్ పేర్కొన్నారు. విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకలలో పాల్గొన్న జెసి ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు.

## 87 వార్డు లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**కూర్మన్నపాలెం, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** జీవీఎంసీ 87 వార్డు పరిధిలో గల కణితి విశ్వ బ్రాహ్మణ వీధిలో కమ్యూనిటీ హాల్లో, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో కులవృత్తి ఆరాద్య దైవం
విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కులవృత్తులకే ఆరాద్య దైవాన్ని విరాట విష్కర్మ ఆహార ప్రధాతగా, పురుష సూక్తం లో విరాట్ పురుషుడిగా కీర్తి పొందాడు, సకల వేదాల ప్రకారం విశ్వకర్మ సృష్టికర్త విరాట్ విశ్వకర్మ పంచ ముఖాల నుండి మనం ఉద్భవించారు. వేరే లోక నిర్మాణ కర్తలని భూ లోకంతో సహా అన్ని లోకాలను తమ కళా నైపుణ్యంతో నిర్మించాలని, ప్రతీది లోక నిర్మాణ కర్తలని భూ లోకంతో సహా అన్ని లోకాలను తమ కళా నైపుణ్యంతో నిర్మించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బోడ్డా గోవింద, ప్రగడ శ్రీనివాస్, చిత్రాడ వెంకటరమణ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బోండా గోవింద రాజులు, దాకా సత్తిబాబు, కణితి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు యూత్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# స్వస్థ నారి - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పెమ్మసాని

**గుంటూరు, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** గుంటూరు లోని మెడికల్ కాలేజీలో జరిగిన స్వస్థ నారి – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ అన్సారియా ముఖ్య అతిథిగా బుధవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని మాట్లాడుతూ సహనానికి, సంస్కారానికి, సంస్కృతికి ఆనవాళ్ళు అయినటువంటి మహిళలకు, ప్రజలకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను.
రాజకీయాలకి అతీతంగా నేను అభిమానించే నాయకులు మోదీ అని, నాయకులు ఎంతో మంది వస్తుంటారు కానీ, దేశం గతిని మార్చే నాయకులు కొంతమంది ఉంటారన్నారు.
అలాంటి వారిలో తన జీవితాన్ని దేశానికి పూర్తిగా త్యాగం చేసిన వారు నరేంద్ర మోదీ అన్నారు. ఇవాళ అమెరికాలో కూడా భారతీయులకు గౌరవం దక్కేలా చేస్తూ, దీపావళి వంటి ఎన్నో పండుగలకు ఆ దేశం సెలవులు ప్రకటిస్తూ, గౌరవించే విధంగా చేసిన నాయకులు మోదీ అన్నారు. భారత్ నాల్గవ ఆర్థిక శక్తిగా ఎదిగింది అంటే దానికి కారణం మోదీ అన్నారు. ఎక్కడా లేని విధంగా ప్రపంచంలో యూపీఐ ద్వారా డిజిటల్ పేమెంట్లను పరిచయం చేశారు. ఇవాళ 30 కోట్ల సెల్ ఫోన్ లను ఇండియాలో తయారుచేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలుగుతున్నాం. ఎంతో అద్భుతంగా ఇవాళ బెంగళూరులో ఉన్న విమానాశ్రయాలు మరో ప్రాంతంలో లేవని చెప్పాలి, ఇవాళ ప్రతి గ్రామంలో ఎలక్ట్రిసిటీ, గ్యాస్ బండలు కూడా అందుబాటు లోకి తీసుకు రాగలిగారు.
మన దేశంలో తయారవుతున్న డిఫెన్స్ సెక్యూరిమెంట్ తమకు కూడా కావాలని ఇతర దేశాలు అడుగుతున్నాయంటే దానికి కారణం ప్రధానమంత్రి మోదీ అన్నారు. స్వస్థనారి – సశక్తి పరివార్,
మహిళల ఆరోగ్యం పరి రక్షించే కార్యక్రమం ఇప్పుడు మనం చేపడుతున్నాము. అందరి కంటే ఆఖరికి ఆరోగ్యం పై ఆలస్యంగా ఆలోచించుకునేది మహిళలు మాత్రమే.
స్త్రీలకు పౌష్టిక ఆహారం కోసం రూ. 5– 6 వేల రూపాయలు అందజేస్తున్నారు.
ప్రభుత్వ పథకాలు ఉపయోగించు కోవాల్సిన అవసరం, హక్కు ప్రజలందరికీ ఉందన్నారు. ఆయుష్మాన్ భారత్ అవకాశాన్ని మేము వచ్చిన తర్వాత మరింత ఎక్కువ సంఖ్యలో పెంచాము.
త్వరలోనే తొమ్మిది లక్షలు వరకు చేరుకోగలుగుతున్నామన్నారు.
పెండింగ్ ఇంకా ఎవరైనా ఆయుష్మాన్ భారత్ కార్డును తీసుకోకపోతే తీసుకోవాలని కోరుతున్నాను అన్నారు.
అంతకు ముందు మహిళలకు ఆస్తి లో సమాన హక్కులు కల్పించింది ఎన్టీఆర్ అన్నారు. మహిళల కోసం పద్మావతి యూనివర్సిటీ తీసుకొచ్చారు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చిన వ్యక్తి అన్న ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ తీసుకు వచ్చిన రిజర్వేషన్లను, సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి డ్వాక్రా గ్రూపులతో మహిళలకు ఆర్థిక స్వాతంత్రాన్ని అందజేసిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
ఇలా ప్రజలకు, మహిళలకు అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడే నాయకులు, ప్రభుత్వం ఏది అని తెలుసుకొని ప్రజలు ఎన్నుకోవాలి అని కోరుకుంటున్నాను.
ఈ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రతి గ్రామ, గ్రామానికి, మహిళలకు చేరువ అయ్యేలా చూస్తారని వైద్య శాఖ అధికారులు కోరుకుంటున్నాను. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ
స్వస్తినారి సశక్తి – పరివార అభియాన్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఒక కొత్త వరవడిని తీసుకొస్తున్నాం. మహిళా పక్షపాతిగా




గతంలోనూ ఎన్నో సంక్షేమ పథకాలను, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉపయోగించు కొని గుంటూరు జిల్లా మహిళలందరూ తమ ఆరోగ్యాలను మెరుగుపలుచు కోవాలని కోరుకుంటున్నాము. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల మహిళలకు అవగాహన కల్పిస్తు, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. గుంటూరు జిల్లా లోని పీహెచ్సీ, సిహెచ్సీ, ఏరియా హాస్పిటల్, జిజిహెచ్ అన్నిచోట్ల ఈ కార్యక్రమాలను చేపడుతున్నాము. మహిళలు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలి, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్.ఎస్.ఐ.డి.సి ఎండి గిరీషా, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రానం హరిబాబు, జడ్పీ చైర్పర్సన్ క్రిస్టియానా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసి కాలనీని సందర్శించిన కమిషనర్ చక్రవర్తి

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:** ఏఎంసి కాలనీ సమస్యల పై శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర లకు 83 వ డివిజన్ కూటమి నాయకులు బోద్దపు ప్రసాద్, మంగ ఈశ్వర్, టిడిపి మీడియా కో ఆర్డినేటర్ ఎస్. భానుచందర్ (అఖి), కాలనీ వాసులు వినతిపత్రం ఇచ్చారు. ఏఎంసి కాలనీ ప్రజలు వినతిపత్రం పై స్పందించి బుధవారం జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి కాలనీలొ పర్యటించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కావలసిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే కాలనీ గవర్నమెంట్ అపార్ట్మెంట్ లొ సెప్టిక్ టాంకును పూర్తి గా మరమ్మతులు చేబడతామని చేప్పారు. తాగునీటి సమస్యలు, చాపల బజార్ దుర్వాసన సమస్యల పై స్థానిక శాసనసభ్యులు కాలనీ వాసుల సమస్యల పై త్వరలోనే చర్యలు చెప్పట్టాలని ఆదేశాలు జారీజేశారని, వారి ఆదేశాల మేరకు ఈ రోజు కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నామని అన్నారు. వీలుయినంత తొందరగా ఇక్కడ సమస్యలను పూర్తి చేస్తామని కోలని వాసులకు కమిషనర్ చెప్పారు. వినతిపత్రం ఇచ్చి24 గంటలు కూడా గడవక ముందే మా సమస్యల పై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పందించిన తీరుకు ఏఎంసి కాలని వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలగా ఎంత మంది నాయకుల చుట్టూ తిరిగిన తీరని మా సమస్యల పై కొణతాల రామకృష్ణ ఒక్కరోజులో స్పందించి చర్యలు తీసుకోవడం మా కాలనికి మంచి రోజులు వచ్చాయని స్థానిక కాలని వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్టిసి ఉపాధ్యక్షులు పిట్ల రాజు, బొమ్మల దేవి, కొణతాల గణేష్, షేక్ రియాజ్, నీలపు పండు, గూడుపు పోలారావు, బండి శివ, మిడిపాటీ సాయి జగన్, సోమాదుల సంతోష్, కిరణ్, శేఖర్, ఉమ మహేష్, మరియు అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత అధికారులు, ఏఎంసి కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శరన్నవరాత్రుల కరపత్రాన్ని ఆవిష్కరించిన కమిటీ సభ్యులు




**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 17:**పట్టణంలో ప్రసిద్ధి చెందిన కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో బుధవారం ఆలయ మండపంలో దేవి శరన్నవరాత్రుల కరపత్రాన్ని కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. గత ఏడాది వలె ఈ ఏడాది కూడా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి త్రో తోనే ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా




**టోక్యో :** జావెలిన్ త్రో లో ఎదురులేని చాంపియన్ నీరజ్ చోప్రా (27) వరల్డ్ చాంపియన్ షిప్స్ పురుషుల జావెలిన్ త్రోలో బుధవారం తొలి త్రో తోనే ఫైనల్స్‌కు చేరుకున్నారు. జావెలిన్ త్రోలో అర్హత సాధించేందుకు ఆటోమేటిక్ క్వాలిఫైయింగ్ మార్క్ 84.50 మీటర్లు. అయితే నీరజ్ చోప్రా మొదటి రౌండ్‌లోనే 84.85 మీటర్లకు ఈటెను విసిరి గ్రూప్ ఎ లో స్థానం సంపాదించుకున్నారు. వాస్తవానికి చోప్రానే తొలి రౌండ్ లోనే ఫైనల్‌కు చేరుకున్న మొదటి త్రోయర్. బుధవారం జరిగిన 19 మందితో కూడిన గ్రూప్ ఎ క్వాలిఫికేషన్ రౌండ్‌లో చోప్రాతో పాటు జర్మన్ త్రోయర్ జూలియన్ వెబర్ (87.21మీ), కెషోర్న్ వాల్కాట్, జాకబ్ వడ్లెజ్, సచిన్ యాదవ్‌లు ఫైనల్‌కి చేరుకున్నారు. గురువారం ఫైనల్స్ జరగనున్నాయి. బుడాపెస్ట్‌లో జరిగిన గత వరల్డ్ చాంపియన్ షిప్‌లో చోప్రా 88.17 మీ ఈటెను విసిరి గోల్డ్ గెలుచుకున్న సంగతి తెలిసిందే.

## ట్రంప్ టారిఫ్‌లతో క్షీణించిన భారత ఎగుమతులు



**న్యూ ఢిల్లీ :** ట్రంప్ విధించిన అధిక టారిఫ్ లతో భారత్ నుండి అమెరికాకు ఎగుమతులు పడిపోయాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ ( జిటిఆర్) సంస్థ బుధవారం తెలిపింది. జులై నెలలో 16.3 శాతంగా ఉన్న ఎగుమతులు, ఆగస్టు నాటికి 6.7 బిలియన్ డాలర్లకు క్షీణించాయని తెలిపింది. ఆగస్ట్ 27 నుండి 50 శాతం టారిఫ్‌లు అమల్లోకి వస్తాయన్న ప్రకటనతో 2025 లో అత్యంత తీవ్రమైన నెలవారీ పతనం రికార్డయిందని పేర్కొంది. జులైలో ఎగుమతులు జూన్‌తో పోలిస్తే 3.6 శాతం తగ్గి 8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జూన్ నెలలో కూడా మేతో పోలిస్తే 5.7 శాతం తగ్గి 8.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఎగుమతుల్లో వృద్ధి నమోదైన చివరి నెల మేనెల. మేలో అమెరికాకు ఎగుమతులు ఏప్రిల్‌తో పోలిస్తే 4.8 శాతం పెరిగి 8.8 బిలియన్ డార్లకు చేరుకున్నాయి. ఏప్రిల్‌లో 8.4 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లతో అమెరికాకు భారతదేశ ఎగుమతులు భారీగా క్షీణించాయని జిటిఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. 2026 ఆర్థిక సంవత్సరం లోనూ ఇదే విధంగా టారిఫ్‌లు కొనసాగితే, భారత ఎగుమతులకు 30–35 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. భారతదేశ వస్తువల ఎగుమతుల్లో అమెరికా వాటా సుమారు 20 శాతం ఉండటంతో ఇది అతిపెద్ద దెబ్బ అని అన్నారు. ప్రభుత్వం ఎగుమతిదారులకు అవసరమైన మద్దతు చర్యలను చేపట్టాలని కేంద్రానికి సూచించారు. త్వరగా ఉపశమనం లేకుండా, సుదీర్ఘమైన టారిఫ్‌ల ప్రభావం ఉద్యోగాల్లోనూ నష్టాలకు దారితీస్తుంది. 2026 నాటికి దాని వాణిజ్య పనితీరును బలహీనపరుస్తుందని అన్నారు.

# ఆ నటికి థర్డ్ క్లాస్ లోనే ఉప్పెనొచ్చిపోయింది!



మోనికా వైబ్‌లో కృతి శెట్టి

క్రష్ లేని హీరోయిన్ ఉండదు. స్టార్ హీరోలపై నవతరం భామల క్రష్ ఎప్పటికప్పుడు రివీల్ చేస్తూనే ఉంటా రు. సినిమాల్లోకి రాకముందే? స్కూల్.... కాలేజ్...జాబ్ చేస్తోన్న సమయంలోనూ భామా మణుల క్రష్ విష యాలు ఎంతో ఓపెన్ గా చెబుతుంటారు. సినిమాల్లోకి వచ్చిన తర్వాత హీరోలపై క్రష్‌ని అంతే ఓపెన్ అవుతుంటారు. తాజాగా కృతిశెట్టి క్రష్ గురించి రివీల్ చేసింది. బేబమ్మకు ఏ హీరోపై క్రష్ లేదు కానీ ..స్కూల్లో ఉన్న సమయంలో స్నేహితుడి స్నేహితుడిపై మాత్రం క్రష్ ఉండేదని తెలిపింది.

**క్రష్ లేని హీరోయిన్:**

స్కూల్ అంటే హైస్కూల్ కూడా కాదు. ఎలిమెంట్రీ స్కూల్ క్రష్ ఇది. మూడవ తరగతి చదువుతోన్న సమ యంలో ఉన్న క్రష్ ఇది. తొలిసారి అబ్బాయిపై క్రష్ అన్నది ఉప్పొనొచ్చినట్లు వచ్చి పోయిందని తెలిపింది. ఆ తర్వాత ఎవరి మీద ఎలాంటి క్రష్ లేదని తెలిపింది. స్కూల్..కాలేజ్..సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఎవరైనా? అంటే ఛాన్సే లేదని తేల్చేసింది. అంటే బేబమ్మకు ఏ హీరోపైనా క్రష్ లేదని క్లియర్ చెప్పినట్లు. ఇక ఈ కన్నడిగ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు.

**అంచనాలు తారుమారు:**

టాలీవుడ్ కి తారా జువ్వలా దూసుకొచ్చినా? కెరీర్ ని మాత్రం సక్సెస్ ఫుల్ గా కొనసాగించ లేకపోయింది. %-%ఉప్పెన%-% తో మెరిసినా ఆసక్సెస్ ని సరిగ్గా ట్రాక్ ఎక్కించలేకపోయింది. అవకాశాలొచ్చినా? అమ్మడికి సక్సస్ రూపంలో అదృష్టం కలిసి రాలేదు. కృతి అందం. .అభినయానికి పెద్ద స్టార్ అవుతుందనుకున్న వారి అంచనాలు తల్లకిందులయ్యాయి. ప్రస్తుతం కృతి కోలీవుడ్ లో కెరీర్ ని నెట్టికొస్తుంది. అక్కడ మాత్రం మంచి అవకాశాలే అందుకుంటుంది. కార్తీ హీరోగా నటిస్తోన్న %-%వా వత్తెయార్%-% లో నటిస్తోంది.



**టాలీవుడ్ కి టచ్ లో:**

ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అలాగే నయనతార ప్రొడక్షన్ హౌపస్ లో తెరకెక్కుతోన్న 'లవ్ ఇన్సురెన్స్ కంపెనీ' లో నటిస్తోంది. ఇందులో ప్రదీప్ రంగనాథ్ హీరో. అన్ని పనులు పూర్తి చేసుకుని సెప్టెంబర్ లో రిలీజ్ కానుందీ చిత్రం. అలాగే 'జెన్నీ' అనే మరో చిత్రం లోనూ నటిస్తోంది. ఈ రెండు సినిమాలపై కృతి చాలా ఆశలు పెట్టుకుంది. సక్సస్ తో కోలీవుడ్ లో స్ట్రాంగ్ గా నిలబడాలని చూస్తోంది. అక్కడ విజ యాలతో టాలీవుడ్ లోనూ కంబ్యాక్ అవ్వాలని చూస్తోంది. ఇక్కడ అవకా శాలు వదిలేయలేదు. పాత పరిచయాలతో కొత్త అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది.



నిధి అగర్వాల్ ఎర్రటి చీరలో మెరిసి పోయింది

## నేషనల్ క్రష్ తప్ప ఇంకెవ్వరూ పోటీలో లేరా!



సౌత్ లో ఎన్ని సినిమాలు చేసినా? అంతిమంగా బాలీవుడ్ లో స్థిరపడాలి అన్నది ప్రతీ హీరోయిన్ కల. ఈనేపథ్యంలో నటీమణులంతా బాలీవుడ్ అంటే ఆసక్తి చూపిస్తుంటారు. సౌత్ భామలు సైతం బాలీవుడ్ అవకాశాల కోసమే ఎదురు చూస్తారు. వచ్చాయంటే సౌత్ లో ఎంత బిజీగా ఉన్నా వాటిని వదిలేసి మరీ వెళ్లిపోతుంటారు. అక్కడ వచ్చే ఆదాయం మిగతా పరిశ్రమలకంటే అధికంగా ఉంటుంది. సెలబ్రిటీ లైఫ్ మరింత రిచ్ గా ఉంటుంది. బాలీవుడ్ అంటే పెద్ద ఇండస్ట్రీ కూడా. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించే అవకాశం బాలీవుడ్ లో ఉంటుంది.

**అవకాశాలు కష్టమేనా:**

అందుకే దక్షిణాది పరిశ్రమలో ఎన్ని సినిమాలు చేసినా చాలా మంది హిందీకి వెళ్లలేకపోయామనే నిరుత్సాహన్ని వ్యక్తం చేస్తుంటారు. సమంత, కీర్తి సురేష్, రష్మికా మందన్నా ఇప్పటికే బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. శ్రీలీల కూడా హిందీకి ఎంట్రీ ఇచ్చింది. ఇంకా మరికొంత మంది భామలు ముంబై కి చేరుకున్నారు. కానీ వీళ్లలో రష్మిక మదన్నా తప్ప ఇంకెవ్వరూ బాలీవుడ్ భామలతో పోటీ పడలేకపోతున్నారు? అన్నది వెలుగులోకి వచ్చింది. అవకాశాల కంటే ముందే మీడియా అటెన్షన్ డ్రా చేయడంలోనూ రష్మిక మినహా ఎవరూ కాంపిటీషన్ లో కనిపించలేదన్నది తాజా సమాచారం.

**ఎలివేషన్ ఏదీ వర్కౌట్ అవ్వలేదు:**

ఉత్తరాది భామలతో పోలిస్తే దక్షిణాది భామలు గ్లామర్ ఎలివేషన్ పరంగా ఎంత మాత్రం పోటీ ఇవ్వలేక పోతున్నారు. అందులో సక్సెస్ అయిది రష్మిక మాత్రమేనని మిగతా వారంతా అక్కడ కల్చర్ కు అల వాటు పడలేకపోతున్నారు. సమంత రెండుళ్లగా బాలీవుడ్ లోనే ఎక్కువగా తిరుగుతోంది. సినిమాలు చేయకపోయినా? అమ్మడి ఫోకస్ అంతా అక్కడే ఉంది. వీలైనంత వరకూ ఎక్స్ పోజ్ అయ్యే ప్రయత్నం చేస్తుంది. కానీ సామ్ ఎలివేషన్ ఏది? వ్యక్తిగత హైప్ తీసుకు రావడం లేదు.

**రష్మిక మాత్రమేనా:**

కీర్తి సురేష్ కూడా నిబంధనలు సడలించిందనే ప్రచారం తప్ప అక్కడ భామలకు ధీటుగా ముందుకెళ్ల లేకపోతుంది. ముంబై బ్యూటీ పూజా హెగ్డే పెట్టాల్సిన ఎఫెర్ట్ అంతా ఎప్పుడో పెట్టేసింది. కానీ ఆ బ్యూటీ కూడా కాంపిటీషన్ లో లేదు. తెలుగు అమ్మాయి శ్రీలీల కూడా అక్కడ కల్చర్ కు అలవాటు పడటం అంత సులభం కాదు. వీళ్లందరిలో ఉన్నంతలో రష్మిక బెటర్ గా కనిపిస్తుంది. బాలీవుడ్ నవతరం భామలకు మంచి పోటీగా నిలుస్తుంది. మీడియా అటెన్షన్ డ్రా చేయగల్గుతుంది. కొత్త అవకాశాలు అందుకో గల్గు తుంది. ఇదంతా ఎలా సాధ్యమైందంటే? పోటీని తట్టుకుని ముందుకెళ్లింది కాబట్టే అన్నది గ్రహించాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com